ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కర్ణాటక వార్తలు
శుక్రవారం 2 ఆగస్టు 2024




వయనాడ్ బాధితులకు రష్మిక సాయం



బెంగళూరు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): కేరళ రాష్ట్రం వయనాడ్‌లో వరద బాధితులను ఆదుకోవడానికి పలు రంగాలకు చెందినవారు ముందుకు వస్తున్నారు. ప్రముఖ దక్షిణాది హీరోయిన్ రష్మికా మందణ్ణ పదిలక్షలు సాయం చేసినట్లు తెలిసింది. కేరళ ముఖ్యమంత్రి పిణరాయ్ విజయన్‌కు సీఎం రిలీఫ్ ఫండ్‌కు పంపినట్లు సమాచారం. రష్మికా సాయం ప్రకటించడంపై ఆమె అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.





మార్పు తప్పదా..?

- గవర్నర్ నోటీసులతో కాంగ్రెస్‌లో కలకలం
- సిద్దూ మెడకు చుట్టుకున్న 'ముడా' అవినీతి
- కేబినెట్ భేటీకి సీఎం గైర్హాజరు
- ముఖ్యమంత్రి మార్పుపై జోరందుకున్న ఊహాగానాలు
- యడియూరప్ప తరహాలోనే పునరావృతం కానుందా..?

బెంగళూరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మైసూరు నగరాభివృద్ధి ప్రాధికార (ముడా)లో ఇంటి స్థలాల వివాదం ముఖ్యమంత్రి సిద్దరామయ్య మెడకు చుట్టుకుంది. నెలరోజులక్రిందట ముడాలో ఇళ్లస్థలాల వివాదం బహిర్గతమయ్యింది. సీఎం సిద్దరామయ్య భార్య పార్వతికి పుట్టింటివారు పసుపుకుంకుమగా ఇచ్చిన స్థలాన్ని 'ముడా' ఆక్రమించుకుని 50/50 నిష్పత్తిన 14 ఇళ్లస్థలాలను కేటాయించారు. 'ముడా'లో ఇళ్లస్థలాల పంపిణీ ప్రక్రియ మూడున్నర దశాబ్దాలుగా సాగుతోంది. అయితే సిద్దరామయ్య భార్య పేరిట ఏకంగా ఇళ్లస్థలాలను కేటాయించడంతోపాటు వారికి అనుకూలమైనవారికి ఇష్టారాజ్యంగా స్థలాలు కేటాయించారనే విషయమై నెలరోజుకిందట అవినీతిపై అప్పటి జిల్లా అధికారి అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆ తర్వాత నగరాభివృద్ధిశాఖ మంత్రి బైరతి సురేశ్ రంగంలోకి దిగి కొన్ని ఫైళ్లను బెంగళూరుకు తీసుకురావడంతోపాటు కొందరి అధికారులపై వేటు వేయడంతో అవినీతి జరిగిందనే ఆధారాలకు ఊతమిచ్చింది. ఇలా సాగుతుండగానే శాసనసభ కార్యకలాపాల్లోనూ ఈ అంశం అట్టుడికింది. ఇటు శాసనసభ, అటు పరిషత్‌లో రెండు రోజులపాటు ప్రతిపక్ష బీజేపీ, జేడీఎస్‌లు చర్చకు డిమాండ్ చేయడం, స్పీకర్, సభాపతి అనుమతించకపోవడంతో మలుపు తిరిగింది. బీజేపీ, జేడీఎస్ సభ్యులు నేరుగా రాజ్‌భవన్‌కు వెళ్లి నేరుగా సమస్యను వివరించారు. 'ముడా' ఇంటి స్థలాల్లో అవినీతి జరిగిందని, సీఎం రాజీనామా చేయాలని సీబీఐ దర్యాప్తు జరిపించాలని గవర్నర్‌ను కోరారు. ఈలోగా సామాజిక కార్యకర్త అబ్రహాం 'ముడా' అవినీతిపై విచారణ జరిపించాలని గవర్నర్‌ను కోరారు. అబ్రహాం ప్రాసిక్యూషన్ కోరడంపై గవర్నర్ స్పందించారు. ముఖ్యమంత్రి సిద్దరామయ్యను 'ముడా' అవినీతిపై వివరణ ఇవ్వాలని గవర్నర్ నోటీసులు జారీ చేశారు.

గవర్నర్ సంతృప్తి చెందకపోతే...

సీఎం సిద్దరామయ్య రాజ్‌భవన్ నుంచి వచ్చిన నోటీసులకు వివరణ ఇవ్వాల్సి ఉంటుంది. ఇప్పటికే ముఖ్యమంత్రి వారం క్రితం నేరుగా రాజ్‌భవన్‌కు వెళ్లి గవర్నర్‌ను భేటీ అయి సమగ్రంగా చర్చించారు. అయినా నోటీసులు రావడంతో ఏం జరగనుందనేది ఉత్కంఠ అవుతోంది. సీఎం సిద్దరామయ్య 'ముడా' అవినీతిపై సమగ్రంగా నివేదిక ఇచ్చినా గవర్నర్ సంతృప్తి చెందకపోతే ప్రాసిక్యూషన్‌కు వెళ్లకతప్పదు.

మార్పు అనివార్యమైతే ముఖ్యమంత్రి ఎవరు..?


ముఖ్యమంత్రి సిద్దరామయ్య వివరణకు గవర్నర్ అంగీకరించకపోతే నాయకత్వ మార్పు అనివార్యం కానుంది. అదే జరిగితే కొత్త ముఖ్యమంత్రి ఎవరనే ఊహాగానాలు హల్‌చల్ చేస్తున్నాయి. ముఖ్యమంత్రి పదవి కోసం ఏడాదిక్రిందటే సిద్దరామయ్య, డీకే శివకుమార్‌లు పోటీ పడిన విషయం తెలిసిందే. అధిష్టానం పెద్దలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ సర్దుబాటు చేసి రాజీ కుదిర్చారు. ముఖ్యమంత్రి పదవిపై ఆశలు పెట్టుకున్న డీకే శివకుమార్ ప్రస్తుత క్లిష్ట సమయంలో మాత్రం సిద్దరామయ్యకు అండగానే ఉన్నారు. 'ముడా' అవినీతి విషయం మినహా సిద్దరామయ్యపై 40ఏళ్ల రాజకీయ చరిత్రలో ఎటువంటి ఆరోపణలు లేవు. కానీ ఈడీ, సీబీఐ కేసులు ఎదుర్కొంటున్న డీకే శివకుమార్‌కు అంత సునాయాసంగా సీఎం హోదా దక్కుతుందనేది చెప్పలేం. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే జన్మదినం వేళ అభిమానులు కాబోయే సీఎం అంటూ నినాదాలు చేసిన అంశం కూడా తీవ్రంగానే పరిగణించాల్సి ఉంటుంది. అయితే జాతీయ రాజకీయాలనుంచి ఖర్గే వెనుదిరిగి వస్తారా అనేది గమనించాల్సిన అంశం. ఇక మరెవరికి అవకాశం ఉంటుందనే చర్చలు సాగుతున్నాయి. రెవెన్యూశాఖ మంత్రి కృష్ణబైరేగౌడ పేరు వినిపిస్తోంది.

యడియూరప్ప సీన్ పునరావృతం కానుందా..?



నేటి సర్కార్‌ను చూస్తుంటే అందరికీ అప్ప సీనే గుర్తుకొస్తోంది. అప్పటి సీఎం యడియూరప్ప చట్టవ్యతిరేకంగా డీ నోటిఫికేషన్ చేశారని సిరాజిన్ బాషా అనుమతి కోరుతూ 2011లో గవర్నర్‌కు వినతి ఇచ్చారు. పరిశీలన జరిపిన అప్పటి గవర్నర్ హంసరాజ్ భరద్వాజ్, యడియూరప్పకు వ్యతిరేకంగా ప్రాసిక్యూషన్‌కు అనుమతులు ఇచ్చారు. దీంతో చిక్కుల్లో పడ్డ యడియూరప్ప సీఎం పదవికి రాజీనామా చేయక తప్పలేదు. ప్రాసిక్యూషన్ అనుమతి పొందిన తర్వాత యడియూరప్పపై లోకాయుక్తకు ఐదు ఫిర్యాదులు చేశారు. దీంతో విచారణకు హాజరు కావాలని కోర్టు యడియూరప్పకు నోటీసులు ఇచ్చింది. యడియూరప్ప బెయిల్‌పిటీషన్ దాఖలు చేశారు. తిరస్కరణ కావడంతో జ్యూడీషియల్ కస్టడీకి వెళ్లాల్సి వచ్చింది. ఆ ఘటన రాష్ట్ర రాజకీయాల్లో పెను సంచలనమైంది. సరిగ్గా 13ఏళ్ల తర్వాత పునరావృతం కానుందా అనేది చర్చనీయాంశంగా మారింది.

డీకే ఆధ్వర్యంలోనే..



- కేబినెట్ సమావేశానికి డీకే అధ్యక్షత
- గవర్నర్ నోటీసుల వాపసుకు తీర్మానం

బెంగళూరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): రాజ్‌భవన్‌నుంచి నోటీసులు రావడంతో గురువారం నాటి మంత్రివర్గ సమావేశానికి సీఎం సిద్దరామయ్య దూరంగా ఉన్నారు. డీసీఎం డీకే శివకుమార్ నేతృత్వంలో భేటీ జరిగింది. 2013 మేలో సిద్దరామయ్య నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పడగా ప్రతి గురువారం కేబినెట్ భేటీ నిర్వహించారు. అనివార్య సమయాలు, శాసనసభ సమావేశాల వేళ కొంత సడలింపులు జరిగాయి. ఇలా ప్రతి సమావేశం సీఎం సిద్దరామయ్య అధ్యక్షతన జరిగింది. కానీ తొలిసారి డీసీఎం నేతృత్వంలో సమావేశం ఏర్పాటైంది. కేబినెట్ తీర్మానాలపై డీసీఎం డీకే శివకుమార్, మంత్రులు పరమేశ్వర్, హెచ్‌కే పాటిల్, కృష్ణబైరేగౌడతోపాటు దాదాపు అందరూ పాల్గొని మీడియాకు వివరించారు. డీసీఎం డీకే శివకుమార్ మాట్లాడుతూ 'ముడా'లో అవినీతి జరిగిందని వివరణ కోరుతూ గవర్నర్ ముఖ్యమంత్రికి ఇచ్చిన నోటీసును రద్దు చేయాలని, సామాజిక కార్యకర్త అబ్రహాం పిటీషన్‌ను తిరస్కరించాలని గవర్నర్‌ను కోరదలిచినట్టు కేబినెట్‌లో నిర్ణయం తీసుకున్నామన్నారు. రాజ్యాంగం, ప్రజా ప్రభుత్వానికి మచ్చ తెచ్చేలా కేంద్రం వ్యవహరిస్తోందన్నారు. 136 స్థానాల్లో గెలుపొంది ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశామని చట్టం, రాజ్యాంగానికి గౌరవిస్తామన్నారు. అయితే కేంద్రప్రభుత్వం గవర్నర్‌ను దుర్వినియోగం చేసుకుంటోందన్నారు. ఇప్పటికే 'ముడా'పై న్యాయ విచారణకు ఆదేశించారు. ఓవైపు మాజీ న్యాయమూర్తి విచారణ జరుపుతుండగానే గవర్నర్ నోటీసులు ఇచ్చి ఏడు రోజుల్లో వివరణ ఇవ్వాలని కోరడం ఎంతవరకు సమంజసమన్నారు. ఇప్పటికే చీఫ్ సెక్రటరీ సుదీర్ఘ వివరణ ఇచ్చారన్నారు. చీఫ్ సెక్రటరీ వివరణను సమగ్రంగా పరిశీలించకముందే సీఎంకు నోటీసులు ఇచ్చారన్నారు. న్యాయ విచారణ సాగుతున్న తరుణంలోనే షోకాజ్ నోటీసు జారీ చేయడమంటే ప్రజాస్వామ్యం, రాజ్యాంగానికి అన్యాయం చేసినట్టే అన్నారు. ముఖ్యమంత్రి ఇంటి స్థలాలు పొందిన విషయంలో హోదాను ప్రభావితం చేశారనే సాక్షాలు ఉన్నాయా... ఎక్కడ నేరం జరిగిందని ప్రశ్నించారు. గతంలో 'ముడా' అవినీతి బహిరంగమైనా బీజేపీ ఎందుకు మౌనంగా ఉందని ప్రశ్నించారు. సీఎం మార్పు జరగాలని, ప్రభుత్వాన్ని కూల్చాలనే కుట్ర పన్నారని ఇది అసాధ్యమన్నారు. న్యాయపోరాటం చేయాలని మంత్రివర్గ భేటీలో ఏకగ్రీవంగా తీర్మానించామన్నారు. న్యాయ, శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి హెచ్‌కే పాటిల్ మాట్లాడుతూ మంచి సంప్రదాయాన్ని చూపాలనే సీఎం కేబినెట్‌కు హాజరు కాలేదన్నారు. న్యాయసలహాదారుడు, ఎమ్మెల్యే ఏఎస్ పొన్నణ్ణ అభిప్రాయం మేరకు సెక్షన్ 163 ప్రకారం కేబినెట్ నిర్ణయించిన తర్వాతే గవర్నర్ తీర్మానించాల్సి ఉంటుందని, ఫిర్యాదు వచ్చిందని సీఎంకు నోటీసులు ఇవ్వడం సరికాదన్నారు. మైసూరులో లోకాయుక్త పోలీసులకు టీజే అబ్రహాం ఫిర్యాదు చేశారన్నారు. విచారణాధికారి పరిశీలన జరిపి ప్రాసిక్యూషన్ కోరాలిగానీ అబ్రహాం కోరేందుకు సాధ్యం కాదన్నారు. నేరుగా ఓ ప్రైవేట్ వ్యక్తి గవర్నర్ చెంతకు వెళ్లి ప్రాసిక్యూషన్‌కు అనుమతి ఇవ్వాలని కోరడం చట్టవ్యతిరేకమన్నారు.

మంత్రులకు అల్పాహార విందు

గవర్నర్‌నుంచి నోటీసులు వచ్చిన నేపథ్యంలో ఢిల్లీనుంచి వచ్చిన సీఎం సిద్దరామయ్య మంత్రులతో గురువారం ప్రత్యేకంగా భేటీ అయ్యారు. రెండు రోజులు ఢిల్లీ పర్యటన ముగించుకుని బుధవారం సాయంత్రం బెంగళూరుకు చేరుకున్నారు. గురువారం ఉదయం అత్యవసరంగా మంత్రులకు అల్పాహార విందుకు ఆహ్వానించారు. ఇదే సమయంలో గవర్నర్‌నుంచి వచ్చిన నోటీసులపైనే సుదీర్ఘంగా చర్చించారు. సీఎంకు జారీ చేసిన నోటీసులు ఉపసంహరించాలని న్యాయపోరాటం చేద్దామని, రాజ్‌భవన్‌ను రాజకీయంగా దుర్వినియోగం చేయరాదనే అంశాలపైనే చర్చించారు. డీసీఎం డీకే శివకుమార్‌తోపాటు మంత్రులందరూ అల్పాహార విందుకు హాజరయ్యారు.

ఆయన జీవితమే రంగస్థలం

- నాటక, సినీరంగాల్లో ఖ్యాతి గడించిన మహనీయుడు
- నేడు బళ్ళారి రాఘవ జయంతి



అనంతపురం కల్చరల్, ఆగస్టు 1 : ఆయన జీవితమే రంగస్థలాన్ని తలపిస్తుంది. న్యాయవాదిగా, కళాకారుడిగా , సినీ నటుడిగా అటు నాటకరంగాన్ని, సినిమారంగాన్ని మెప్పించిన ఘనత ఆయనది. అటువంటి మహనీయుడు, కళామతల్లి ముద్దుబిడ్డ బళ్లారి రాఘవ. శుక్రవారం బళ్లారి రాఘవ 144వ జయంతి.


- బళ్ళారి రాఘవగా పేరొందిన తాడిపత్రి రాఘవాచార్లు 1880 ఆగస్టు 2న అనంతపురం జిల్లా తాడిపత్రిలో నరసింహాచారి, శేషమ్మ దంపతులకు జన్మించారు. బళ్ళారి ఉన్నత పాఠశాలలో మెట్రిక్ వరకు చదువుకున్న రాఘవ తర్వాత మద్రాసులోని క్రిస్టియన్ కాలేజీలో న్యాయశాస్త్రం కోర్సులో చేరారు. 1905లో న్యాయ శాస్త్రంలో ఉత్తీర్ణత పొందారు. కర్నూలుకు చెందిన లక్ష్మణాచారి కుమార్తె కృష్ణమ్మను తన జీవిత భాగస్వామిగా చేసుకున్నారు. మద్రాసులోనే న్యాయశాస్త్రం ప్రాక్టీసు ప్రారంభించి, కొద్దికాలంలోనే న్యాయవాదిగా మారారు. ముఖ్యంగా క్రిమినల్ కేసులు వాదించడంలో ప్రసిద్ధి గాంచారు. ఆయన ప్రతిభను గుర్తించిన అప్పటి బ్రిటీష్ ప్రభుత్వం రాఘవను పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమించడంతోపాటు "రావ్ బహదూర్" అనే బిరుదు కూడా ఇచ్చింది.
- బళ్లారి రాఘవకు చిన్నతనం నుంచే నాటకాలపై అమితాసక్తి ఉండేది. ఆయన మేనమామ ధర్మవరం రామకృష్ణవచార్యులు రాఘవను ప్రోత్సహించేవారు. తన 12వ యేటనే రాఘవ మొదటిసారి రంగస్థలంపై నటించారు. బళ్ళారిలో షేక్స్‌పియర్ క్లబ్ స్థాపించి, దానిద్వారా షేక్స్‌పియర్ నాటకాలు ప్రదర్శించేవారు. తెలుగు, కన్నడ, ఇంగ్లీషు, హిందీ భాషలన్నింటిలోనూ రాఘవ ప్రదర్శనలిచ్చారు. బళ్లారి రాఘవ నాటక ప్రదర్శనను చూడడం అద్భుతమైన అనుభూతిగా కళాప్రియులు భావించేవారు. హరిశ్చంద్ర, పాదుకా పట్టాభిషేకం, సావిత్రి, బృహన్నల, రామరాజు చరిత్ర, రామదాసు, తప్పెవరిది, సరిపడని సంగతులు ఇవన్నీ రాఘవకు పేరుతెచ్చిన నాటకాలు. దీనికితోడు శ్రీలంక, ఇంగ్లాండు, ఫ్రాన్స్, జర్మనీ, స్విట్జర్లాండ్ వంటి దేశాలలో పర్యటించి భారతీయ నాటకాలు, కళలను గురించి ఉపన్యాసాలు, సదస్సులు నిర్వహించారు. మిత్రుల ఒత్తిడితో 1936లో రాఘవ సినిమారంగ ప్రవేశం చేశారు. హెచ్‌ఎం రెడ్డి నిర్మించిన "ద్రౌపదీమాన సంరక్షణము" చిత్రంలో దుర్యోధనుడిగా నటించారు. అదేవిధంగా రైతుబిడ్డ, చండిక, కన్యాశుల్కం సినిమాల్లోనూ నటించి అనతికాలంలోనే విశేష ఖ్యాతి పొందారు. తన సమయాన్ని, సంపదను నాటకరంగ పురోగతికోసం దారాళంగా వెచ్చించే బళ్లారి రాఘవ 1946 ఏప్రిల్ 16న స్వర్గస్థులయ్యారు.



బళ్లారిలోని రాఘవ కళామందిరం

బళ్ళారి రాఘవ పేరిట అవార్డు స్థాపన...

బళ్ళారి రాఘవ కళారంగంతోపాటు ఈ లోకాన్ని వీడి స్వర్గస్థులైన నాటినుంచి కళాసంస్థలు, కళాకారులు ఆయనను స్మరించుకుంటూ ప్రతియేటా ఆయన జయంతి, వర్ధంతి సమయాల్లో విశేషమైన సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా అనంతపురం జిల్లాకేంద్రంలోని లలితకళాపరిషత్ ఆధ్వర్యంలో 1999లో బళ్ళారి రాఘవ అవార్డును స్థాపించారు. నాటినుంచి యేడాదికోసారి సినీ రంగం, నాటకరంగాల్లో ఉత్తమ నటులను ఎంపిక చేసి రాష్ట్రస్థాయిలో అవార్డుల ప్రధానం గావిస్తూ వస్తున్నారు. ఈక్రమంలోనే అవార్డు స్థాపించాక తొలిసారిగా 1999లో సినీనటుడు నూతన్‌ప్రసాద్‌కు తొలి అవార్డు ప్రధానం చేశారు. ఆతర్వాత వరుసగా సినీనటులు సోమయాజులు, చాట్ల శ్రీరాములు, దేవదాసు కనకాల, కొండల రావు, గుమ్మడి గోపాలక్రిష్ణ, రమణ మూర్తి, రంగస్థల నటులు లద్దిపల్లి అల్లాబకాష్, జీఏ సత్తార్, కేసీ క్రిష్ణ, బుక్కచెర్ల ఆది నారాయణరెడ్డి, కేకే బాషా, మస్తాన్ సాహెబ్, వెంకటేశ్వరరావు, సి.రాములకు రాష్ట్రస్థాయిలో అవార్డులు ప్రధానం చేయగా జిల్లాస్థాయిలో 2016లో మల్లేశ్వరయ్య, మస్తాన్, 2017లో సంగాల నారాయణస్వామి, 2018లో యస్‌ఆర్‌ఎస్ ప్రసాద్, 2019లో పీవీ రంగారెడ్డిలకు అవార్డులను అందజేశారు. 2020, 2021 సంవత్సరాల్లో బళ్ళారి రాఘవ జయంతి కార్యక్రమాలు నిర్వహించని కారణంగా 2022లో నిర్వహించిన అవార్డుల ప్రధానోత్సవంలో శింగరాయకొండ చౌదరి, వెంకటసుబ్బయ్య, మాధవ, గోవా వెంకట్, డీవై రఘు, రామగోవింద్‌సాగర్‌లకు బళ్లారి రాఘవ అవార్డులు అందజేశారు. 2023లో పౌరాణిక నాటకాల విభాగంలో లక్ష్మినారాయణ, చిదంబరరెడ్డి, సాంఘిక నాటకాల విభాగంలో అరుణ్‌బాబు, డీఏ ఖాదర్‌కు బళ్లారి రాఘవ అవార్డులు అందజేశారు. ఇక 2024 ఏడాదికి సంబంధించి పద్యనాటక రచయితలు పల్లేటి లక్ష్మికులశేఖర్, మర్తాటి ఈశ్వరీగోపాల్‌లు రాష్ట్రస్థాయి బళ్లారి రాఘవ అవార్డులు, పౌరాణిక నాటక కళాకారులు దాసరి దయానంద్, పుట్లూరు సంజీవరెడ్డిలు జిల్లాస్థాయి బళ్లారి రాఘవ అవార్డులకు ఎంపికయ్యారు. శుక్రవారం సాయంత్రం లలితకళాపరిషత్‌లో నిర్వహించే అవార్డు ప్రధానోత్సవ సభలో వీరికి బళ్లారి రాఘవ అవార్డులు అందజేసి సత్కరించనున్నారు.



కమలంలోనూ.. కలకలం

- పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్రపై పెరిగిన అసమ్మతి
- కుమార బంగారప్ప నివాసంలో భేటీ అయిన సీనియర్లు

బెంగళూరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ సర్కార్‌లో లుకలుకలు ఓవైపు సంచలనం రేపుతుంటే కమలంలోనూ అసమ్మతి కలకలం రేపుతోంది. గురువారం ప్రతిపక్ష బీజేపీ అసమ్మతి నేతల భేటీ ఆ పార్టీలో ఆందోళన రేపింది. ఓవైపు ముడా అక్రమాలపై గవర్నర్ నేరుగా ముఖ్యమంత్రిని వివరణ కోరడంతో అధికార కాంగ్రెస్ పార్టీలో అలజడి నెలకొంది. మరోవైపు బీజేపీలోనూ అటువంటి పరిస్థితులే చోటు చేసుకుంటున్నాయి. బీజేపీలో అసమ్మతి నేతలుగా ముద్రపడిన బసనగౌడపాటిల్ యత్నాళ్, రమేశ్ జార్కిహొళి, ప్రతాప్‌సింహలు బెంగళూరులోని కుమార బంగారప్ప నివాసంలో భేటీ అయ్యారు. విజయేంద్ర నాయకత్వంపై తీవ్రంగా వ్యతిరేకించారు. మైసూరు పాదయాత్రకు దూరంగా ఉండాలని తీర్మానించారు. ఇటీవలే రమేశ్‌జార్కిహొళి ఎట్టి పరిస్థితుల్లోనే విజయేంద్ర నాయకత్వాన్ని అంగీకరించేది లేదని ప్రకటించారు. యత్నాళ్ సైతం డీకేను సీఎం చేసేందుకే విజయేంద్ర చలో మైసూరు పాదయాత్ర చేపట్టారని ఆరోపించారు. ఒంటరిగా కాకుండా సమష్టిగా నిర్ణయం తీసుకుందామని నిర్ణయించినట్లు సమాచారం. అధిష్టానం పాదయాత్రలో పాల్గొనాలని సూచిస్తే వెళ్దామని లేనిపక్షంలో మౌనంగా ఉండాలని తీర్మానించారు. లోక్‌సభ ఎన్నికల్లో ఓటమికి గల కారణాలపై నిర్ణయం తీసుకోలేదని, వాటిని సర్దుబాటు చేసే ప్రయత్నం చేయలేదని అభిప్రాయపడ్డారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు ఎన్నికలు జరిగినప్పుడు ఉపాధ్యక్షుల ఎన్నిక కూడా జరగాలని డిమాండ్ చేశారు. నామినేట్ పద్ధతిలో విజయేంద్ర అధ్యక్షుడు అయ్యాడని ఎన్నికలు జరపాలని వారు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో తండ్రీ కొడుకుల పార్టీ అనే ముద్ర చెరిపితేనే పార్టీకి భవిష్యత్తు సాధ్యమన్నారు. పార్టీ పట్ల వ్యతిరేకం కాదని రాష్ట్రంలో కొందరి తీరుతోనే వ్యతిరేకిస్తున్నట్టు తెలిపారు. డీకే శివకుమార్ ఏజెంట్ తరహాలో విజయేంద్ర వ్యవహరిస్తున్నారని యత్నాళ్ మండిపడ్డారు. శివకుమార్ ముందు ఫైల్ పట్టుకుని అధ్యక్షుడు వ్యవహరించడం పార్టీకి శోభ ఉండదన్నారు. కూడల సగమనుంచి బళ్ళారికి పాదయాత్ర జరపాలని నిర్ణయించి అధిష్టానాన్ని కోరామని అనుమతులు వస్తే పాదయాత్ర ఆపేది లేదన్నారు. శుక్రవారం మరోసారి సమావేశం అవుతామన్నారు.





తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1630.81	1,625.81
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	1,25,373	36,766
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	1,54,706	2066
సామర్థ్యం (టీఎంసీలు)	97.14	79.17



వానలు కురిసెను.. వంకలు పారెను

- వరదలతో ఇబ్బందుల్లో ప్రజలు
- కొట్టుకు పోయిన రోడ్లు, వంతెనలు
- ప్రాణాలు కోల్పోయిన ప్రజలు, మూగజీవాలు
- అపార పంటనష్టం

హైద్రాబాద్ కర్ణాటక జిల్లాల్లో కుంభవృష్టి


మలెనాడులో విరిగిపడిన కొండచరియ




మునిగిపోయిన కంప్లి వంతెన

బళ్లారి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): రుతుపవనాలు తరుము కొచ్చాయి. భారీగా కురిసి వానలకు వంకలు, వాగులు పొంగిపొర్లుతున్నాయి. శివమొగ్గ, భద్రావతి, బళ్లారి, విజయనగర, కొప్పళ, బాగలకోట, ధార్వాడ, బెళగామ్, రాయచూరు, ఉడిపి, ఉత్తరకన్నడ జిల్లాల్లో కుంభవృష్టి కురుస్తోంది. ఇప్పటికే చెరువులు, డ్యాంలు నిండిపోయాయి. మలెనాడు ప్రాంతంలో కొండ చరియలు విరిగిపోయాయి. శివమొగ్గ, కొడుగు, భద్రావతి, వద్ద ఉండే డ్యాంలలో ఔట్ ఫ్లో పెరిగింది. ఇందుకు అధికారులు ప్రమాద హెచ్చరికలు జారీచేశారు. కోస్తా, మల్నాడు జిల్లాల్లో కొండచరియలు విరిగిపడుతున్నాయి. ఉత్తరకన్నడ జిల్లా షిరూర్‌లో 8 మంది మరణించిన సంఘటన కూడా చోటుచేసుకుంది. ఎన్‌హెచ్ 75లో సకలేష్ పుర తాలూకాలోని దొడ్డతప్పలే వద్ద కొండచరియలు విరిగిపడటంతో కోస్తా కర్ణాటక ప్రాంతంలో రాకపోకలు నిలిచిపోయాయి.

రుతుపవనాలు కొన్ని జిల్లాలో విపరీత ప్రభావం చూపాయి. పదుల సంఖ్యలో జనం ప్రాణాలు కోల్పోయారు. వందల సంఖ్యలో పశుపక్ష్యాదులు జీవం కోల్పోయాయి. తుంగ, భద్ర డ్యాంలో నీరు ఉదృతంగా ప్రవహిస్తుండడంతో శివమొగ్గ, చిక్కనాకనహళ్లి, శృంగేరి, వరణాడు ప్రాంతాలు పూర్తిగా జలమయమయ్యాయి. రోడ్లు బాగాదెబ్బతిన్నాయి. చాలా గ్రామాలకు రాకపోకలు నిల్చిపోయాయి. విజయనగర జిల్లాలో తుంగభద్ర డ్యాం నిండకుండను తలపిస్తోంది. డ్యాం క్రస్ట్ గేట్లు తెరిచి కృష్ణానదికి నీరు మళ్లించారు. నదిని అనుకునే ఉండే గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. కంప్లి, గంగావతి, సిరుగుప్ప, కొప్పళ, రాయచూరు, తదితర ప్రాంతాల్లో ఉండే గ్రామాలకు రాకపోకలు ఆగిపోయాయి. నదితీరంలో ఉండే గ్రామాల పిల్లలు రెండు మూడు రోజులుగా పాఠశాలలకు వెళ్లడం లేదు. నది తీరంలోని పంటపొలాలు నీటిలో మునిగిపోయాయి. ఈ జిల్లాల్లోదెబ్బతిన్న రోడ్లు, నష్టపోయిన పంటలపై అధికారులు అంచనాలు తయారుచేస్తున్నారు.


శివమొగ్గవద్ద కొండచరియ విరిగిపడడంతో దెబ్బతిన్న వాహనాలు

రక్తదానం చేసిన శునకం


రక్తదానం చేస్తున్న శునకం

బళ్లారి గాంధీనగర్, ఆగస్టు 1: రక్తదానం కంటే మించిన దానం లేదనేది నానుడి. రక్తం ఇవ్వడం ద్వారా మరో ప్రాణాన్ని కాపాడవచ్చుని... రక్తదానం చేయడానికి ప్రతి ఒక్కరు ముందుకు రావాలని రక్తదాన శిబిరాలు నిర్వహించేవారు చెబుతుంటారు. రక్తం అవసరం కేవలం ఒక మనిషికే కాకుండా జంతువులకు కూడా అవసరమే. ఓ పెంపుడు కుక్క రక్తదానంచేసి రక్తహీన వ్యాధితో బాధపడుతున్న మరో కుక్కకు ప్రాణంపోసిన అపురూపమైన ఘటన కొప్పళ నగరంలో జరిగింది. కొప్పళ నగరంలోని పశుచికిత్సాలయంలో ఈ ఘటన చోటు చేసుకుంది. అనారోగ్యంతో బాధపడుతున్న తొమ్మిది(9) ఏళ్ళ ల్యాబ్రడార్ రకానికి చెందిన కుక్కకు అత్యవసరంగా రక్తం అవసరం కావడంతో స్థానిక పశువైద్యులు నగరంలో మూడు పెంపుడు కుక్కల యజమానుల ఇంటికివెళ్ళి రక్తపు శాంపుళ్ళను సేకరించి పరీక్షలు జరిపారు. నగరానికి చెందిన ప్రొఫెసర్ పూజార్ అనే వ్యక్తికి చెందిన డాబర్ మ్యాన్ జాతికి చెందిన పెంపుడు కుక్క మెడ భాగం నుండి 300 మిల్లీలీటర్ల రక్తం సేకరించి అనారోగ్యంతో బాధపడుతున్న కుక్కకు ఎక్కించారు.

పొలాల్లో సోలార్ మైకులు


పొలంలో సోలార్ మైకు

కంప్లి, ఆగస్టు 1 : కూడ్లిగి తాలూకా కొండ ప్రాంతాల్లో ఎలుగు బంట్లు, అడవి పందుల బెడద విప రీతంగా వుండటంతో రైతులు పొలాల్లో సోలార్ మైకులు ఏర్పాటు చేసుకుంటున్నారు. హనుమనహళ్లి గ్రామంలో అడవుల నుంచి రాత్రి వేళల్లో ఎలుగుబంట్లు, అడవి పందులు వచ్చి మొక్క జొన్న పంటను ధ్వంసం చేస్తుండ టంతో రైతులు సోలార్ మైక్‌లను ఏర్పాటు చేసుకున్నారు. వ్యవసాయ శాఖాధికారుల సలహా మేరకు శబ్దం వచ్చేవిధంగా మైకులు ఏర్పాటుచేసి పంటను కాపాడు కుంటున్నామని రైతులు తెలిపారు.

పీజీ కోర్సులకు ప్రవేశ పరీక్ష వద్దు


వీసీ రుద్రేశ్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న ఏఐడీఎస్ఓ

బళ్లారి సిటీ, ఆగస్టు 1: రాష్ట్రంలో పోస్ట్‌గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ప్రవేశపరీక్షను నిర్వహించరాదని శ్రీకృష్ణదేవ రాయ యూనివర్శిటీ చాన్సలర్ రుద్రేశ్ కు ఏఐడీఎస్ఓ వినితి పత్రం సమర్పించింది. ఈసందర్భంగా గురువారం ఏఐడీఎస్ఓ జిల్లా అధ్యక్షులు ఈరన్న మాట్లాడుతూ యూనివర్శిటీల్లో పోస్ట్‌గ్రాడ్యుయేట్ కోర్సులకు ప్రవేశ పరీక్షలు నిర్వహించాలని కర్ణాటక స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనను సమర్పించిందని, ఇది కార్యరూపం దాలిస్తే , ఇప్పటికే గణనీయంగా తగ్గిన ఉన్నత విద్యావంతుల సంఖ్య మరింత తగ్గుముఖం పడుతుందన్నారు. కోచింగ్ లాబీలకు లాభం కలుగుతుందన్నారు. విశ్వవిద్యాలయాల్లో ప్రవేశ పరీక్షను అనుమతించకుండా విద్యార్థుల ప్రయోజనాలను కాపాడాలని ఏఐటీఎస్ఓ విజ్ఞప్తి చేసింది. ఈకార్యక్రమంలో ఏఐడీఎస్ఓ జిల్లా ఉపాధ్యక్షురాలు శాంతి పాల్గొన్నారు.

అటవీ సంరక్షణలో అధికారులే కీలకం


రేంజర్ల దినోత్సవాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

సిరుగుప్ప, ఆగస్టు 01 : అటవీ సంపదను సంరక్షించడంలో అటవీశాఖ అధికారుల పాత్ర ఎంతో వుందని హెడ్ పోస్టుమాస్టర్ మంజునాథ శెట్టి అభిప్రాయం వ్యక్తం చేశారు. గురువారం సిరుగుప్ప పట్టణంలోని పోస్టల్ కార్యాలయంలో అటవీశాఖ రేంజర్ల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంజునాథ శెట్టి మాట్లాడుతూ పశుపక్ష్యాదులను, ప్రాణులను, అటవీ సంపదను సంరక్షించడంలో ఫారెస్టు అధికారుల సేవలు ఎంతో ముఖ్యమని కొనియాడారు. ప్రమాదవశాత్తు మృతి చెందిన అటవీ అధికారులను స్మరించడం కోసం ఈ దినోత్సవాన్ని జరుపుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సమాజ సేవకులు అబ్దుల్ నబీ, పోస్టల్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

శివయోగి సేవలు మరువలేనివి

కంప్లి, ఆగస్టు 1 : మహంత శివయోగి సేవలు మరువలేనివని కంప్లి తహసీల్దార్ శివరాజ్ కుమార్ తెలిపారు. ఆయన జయంతోత్సవాన్ని తహసీల్దార్ కార్యాలయంలో జరుపుకున్నారు. ఈ రోజు వ్యసనముక్త దినోత్సవం కూడా చేపట్టారు. అప్పట్లో మహంత శివయోగి వ్యసన ముక్తులుగా కావాలని రాష్ట్రంలో ఎన్నో సేవలు, పోరాటాలు కూడాచేపట్టారని, ఆయనను ప్రతి ఒక్కరు గుర్తుంచుకోవాలన్నారు.

బాధిత రైతులను ఆదుకోవాలి

- మాజీ మంత్రి శ్రీరాములు


మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీరాములు, ఎమ్మెల్యే సోమలింగప్ప

కంప్లి, ఆగస్టు 01 : తుంగభద్ర నది తీరాన వుండే రైతులను ఆదుకోవాలని జిల్లా మాజీ మంత్రి శ్రీరాములు విజ్ఞప్తిచేశారు. కంప్లి కోట ప్రాంతాన్ని సిరుగుప్ప మాజీ ఎమ్మెల్యే సోమలింగప్పతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షులు విజయేంద్ర ఆదేశాల మేరకు నదిఒడ్డున ప్రాంతాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. తుంగభద్ర నదికి నీరు పోటెత్తడంతో కంప్లి, బెళగోడుహాళ్, సన్నాపురం, ఇటిగి మన్నూరు, రుద్రపాద తదితర గ్రామాలలో వరి పంటలు నీట మునిగాయని, వాటిని రెవెన్యూ శాఖ ద్వారా సర్వే చేయించి రైతులను ఆదుకోవాలని సూచించారు. అలాగే నూతన వంతెనపై తమ హయాంలో నిధులను మంజూరు చేశామని, కానీ ఇప్పుడున్న ప్రభుత్వంగానీ, ఎమ్మెల్యే గానీ నిర్లక్ష్యం వహిస్తున్నారని తెలిపారు. తాము పదవుల్లో వున్నా లేకపోయినా ప్రజలకు అండగా వుంటామని, కంప్లి ప్రజలు తమ వద్దకు తెచ్చే సమస్యలను కూడా పరిష్కరిస్తున్నామన్నారు. అలాగే మాజీ ఎమ్మెల్యే సురేష్‌బాబు కూడా కంప్లి నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ప్రజలకు ఏ సమస్య వచ్చినా అక్కడకు చేరుకుని వారికి అండగా నిలుస్తున్నారన్నారు. మాజీ మంత్రి నాగేంద్ర విషయంపై మాట్లాడుతూ, ప్రజల సొమ్మును దోపిడీ చేసేవారిపై అధికారులు కూడా కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. కంప్లిలోని అధికారులు కంప్లి కోట ప్రజలకు గంజి కేంద్రాలు ఏర్పాటు చేసి దానికి సహకరించాలని కోరారు. కంప్లి కోట ఆంజనేయ ఆలయ పరిసరాలను తెప్పపై వెళ్లి పరిశీలించారు. ఆయనతో జిల్లా అధ్యక్షులు అనిల్ నాయుడు, క్షేత్ర అధ్యక్షులు వీరేష్, బ్రహ్మయ్య, సిద్దప్ప, వీఎల్ బాబు, లక్ష్మీకాంతరెడ్డి, రమేష్, రబియానా, తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్ల వర్గీకరణలో సుప్రీం తీర్పుపై సంబరాలు


సంబరాలు చేపట్టిన చలవాది, హరిజన సమాజ నేతలు

కంప్లి, ఆగస్టు 1 : సుప్రీం కోర్టులో హరిజన, చలవాది రిజర్వేషన్లపై తీర్పు వెలువడటంతో కంప్లి అంబేద్కర్ సర్కిల్‌లో హరిజన, చలవాది సమాజ పదాధికారులు బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు.

ఈ సందర్భంగా రామన్న, వీరాంజనేయులు మాట్లాడుతూ ప్రధాన మంత్రి ఈ రెండు సమాజాలను గుర్తించి 5, 6 శాతం ప్రత్యేక రిజర్వేషన్ కల్పించడం ఎంతో సంతోషించదగ్గ విషయమన్నారు. ఈ విషయంపైన రాష్ట్రంలో ఆంజనేయులు, పరమేష్, ఆంధ్రలో మందకృష్ణ మాదిగ తదితర నాయకులు ప్రధాన మంత్రితో రిజర్వేషన్‌ల వర్గీకరణపై చర్చించడంతో వెంటనే ఈ రెండు సమాజాలను గుర్తించి ఆదేశాలు కూడా ఇచ్చారని తెలిపారు. ఈ రిజర్వేషన్లను ఆయా సమాజాల వారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎన్నో యేళ్లుగా ఖచ్చితమైన రిజర్వేషన్ లేకపోయినా ఎస్సీల్లో కూడా ఎన్నో సమాజాలు వున్నాయని, అయితే ఇప్పుడు తమకు సరైన రిజర్వేషన్లు కల్పించడంపై అందరికీ ధన్యవాదాలు తెలిపారు. వారితో పాటు సీఆర్ హనుమంతు, కుమారస్వామి, లక్ష్మీకాంత్, ఆంజనేయులు, శశికుమార్, గోపాల్, రవి, తదితరులు పాల్గొన్నారు.

వ్యసనరహిత సమాజానికి శివయోగి కృషి

- మేయర్ ముల్లంగి నందీశ్


జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మేయర్

బళ్లారి సిటీ, ఆగస్టు 1 : దురాచారాలపై ప్రజల్లో అవగాహన కల్పించి, వ్యసనరహిత సమాజ నిర్మాణానికి తోడ్పడిన గొప్ప వ్యక్తి మహంత శివయోగి అని బళ్లారి నగర కార్పొరేషన్ మేయర్ ముల్లంగి నందీశ్ అన్నారు. రాజ్‌కుమార్ రోడ్డులోని కల్చరల్ కాంప్లెక్స్ ఆవరణలో గురువారం బెంగళూరు కర్ణాటక మద్య నియంత్రణ మండలి, సమాచార పౌరసంబంధాల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యసన రహిత దినోత్సవాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. మహంత శివయోగి జయఖండి తాలూకా హిప్పరగి గ్రామంలో 1930 ఆగస్టు 1వ తేదీన జన్మించారని, ఆయన 10సంవత్సరాల వయస్సులో సవడిలోని విరక్తమఠానికి అధిపతి అయ్యారన్నారు. ఆయన కృషిని గుర్తించిన ప్రభుత్వం ఆయన జన్మదినమైన ఆగస్టు 1వ తేదీని వ్యసన రహిత దినోత్సవంగా నిర్వహించాలని ఆదేశించిందన్నారు. కన్నడ అధ్యాపకులు బసవరాజు మాట్లాడుతూ మనస్సు, శరీరం, కుటుంబం, దేశ ఆరోగ్యాలను నాశనం చేసే సామాజిక దురాచారాలలో వ్యసనం ఒకటన్నారు. వ్యసనాల నుంచి ప్రజలను విముక్తం చేయాలనే లక్ష్యంతో 1975నుంచి మహంత ఈ పథకాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. మహంత శివయోగి ఇంటింటికీ వెళ్ళి మద్యం పొగాకు వలన కలిగే అన్ని రకాల అనర్థాలను ప్రజలకు తెలియజేశారన్నారు. కార్యక్రమంలో వ్యసనాల జోలికి వెళ్లమని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమానికి ముందుగా కళాశాల విద్యార్థులచే అవగాహన జాతా నిర్వహించారు. ఈసందర్భంగా ఉపమేయర్ సుకుమ్, కన్నడ సాంస్కృతికశాఖ నాగరాజు, డాక్టర్ వీరేంద్రకుమార్, జిల్లాఆరోగ్య విద్యాశాఖాధికారి ఈశ్వర్‌దాసప్పనవర్, గురురాజ, మల్లేశప్ప, హనుమేశ్, తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు.

అక్షర ఆవిష్కరణతోనే విద్యాభివృద్ధి


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఉభయ జిల్లాల కలెక్టర్లు

బళ్లారి సిటీ, ఆగస్టు 1: అక్షర అవిష్కరణ కార్యక్రమం ఈ ప్రాంతంలో విద్యాభివృద్ధికి దోహదపడుతుందని కళ్యాణ కర్ణాటక రీజినల్ డెవలప్‌మెంట్ బోర్డు అధ్యక్షులు డాక్టర్ అజయ్‌సింగ్ తెలిపారు. పాఠశాల విద్యాశాఖ కలబురగి డివిజన్,జేఎస్‌డబ్ల్యూ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం తోరణగల్లులోని విద్యానగర్‌లో జే-మ్యాక్స్ హాల్లో నిర్వహించిన ఎడ్యుకేషన్ 2024 కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. పాఠశాలలు, కళాశాలల్లో మౌలిక వసతులు ,విద్యా ప్రమాణాల పెంపునకు కేకేఆర్‌డీబీ వార్షిక నిధిలో 25శాతం కేటాయించినట్లు తెలిపారు. ఆర్థికసంవత్సరంలో కళ్యాణ్ కర్ణాటక ఏడు జిల్లాల్లోని 1.008ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ప్రీ-ప్రైమరీ పాఠశాలల్లో తరగతులు నిర్వహించామన్నారు. కలబురగి డివిజన్ పాఠశాల విద్య ,అక్షరాస్యత విభాగం డిప్యూటీ కమిషనర్ ఆకాష్ మాట్లాడుతూ గుణాత్మక విద్యారంగంలో అకడమిక్ సామరస్యం సాధించేందుకు విద్యార్థులతోపాటు ఉపాధ్యాయుల పాత్ర ముఖ్యమని ,ఈసదస్సులో నైపుణ్యం కలిగిన లెక్చరర్ల ద్వారా విద్యార్థుల అభ్యసన సమస్యలు గందరగోళాలు పరిష్కరిస్తారని అన్నారు. తదుపరి జిల్లా కలెక్టర్ ప్రశాంత్ కుమార్ మిశ్రా మాట్లాడుతూ విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులు, విద్యార్థుల సహకారం అవసరమన్నారు. ఈసందర్భంగా జిల్లాపోలీసు సూపరింటెండెంట్ శోభరాణి, జిల్లాపంచాయితీ ముఖ్య కార్యనిర్వహణాధికారి రాహుల్ శరణప్ప ,విజయనగరం జిల్లాకలెక్టర్ ఎం.దివాకర్, జేఎస్‌డబ్ల్యూ ముఖ్య కార్యనిర్వహణాధికారి అశ్విని సక్సేనా,వడ్డు గ్రామాధ్యక్షులు నింగమ్మ, విద్యాశాఖాధికారులు నాగరాజు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిదులు,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వాయనం సమర్పించిన ఎమ్మెల్యే దంపతులు


వాయనం వదులుతున్న ఎమ్మెల్యే గణేష్ దంపతులు

కంప్లి, ఆగస్టు 1 : కంప్లి కోట వద్ద తుంగభద్ర నది తీరాన ఎమ్మెల్యే జేఎన్ గణేష్ దంపతులు నదిలో వాయనం వదిలారు. అంతకుముందు ప్రత్యేకపూజలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గణేష్ మాట్లాడుతూ ఈ యేడాది పైభాగంలో పుష్కలంగా వర్షాలు కురుస్తున్నాయన్నారు. దీంతో తుంగభద్ర జలాశయానికి కూడా వరద పోటెత్తుతోందన్నారు. జలాశయం నుంచి ఈ యేడాది ఖరీఫ్, రబీ పంటలకు పుష్కలంగా నీరు అందించవచ్చునన్నారు. నదిఒడ్డున నష్టపోయిన రైతులు ఎవరూ ఆందోళన చెందరాదని, ప్రతి రైతును ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. మున్ముందు నీరు వృథాకాకుండా రబీ సమయంలో తుంగభద్ర నది ఒడ్డునవున్న రైతులకు అనుకూలంగా చిన్న చిన్న చెక్‌డ్యామ్‌లు నిర్మించి నీరు రిజర్వ్ వుండేలా చేసేందుకు ముఖ్యమంత్రితో చర్చిస్తామన్నారు. కంప్లి కోటె మత్స్యకారులకు వరదపోటు వల్ల ఎలాంటి సమస్య తలెత్తకుండా చూడాలని అధికారులకు సూచించారు. అలాగే మత్స్యకారులు కూడా నది వద్దకు వెళ్లరాదని సూచించారు. వీటితో పాటు తహసీల్దార్ శివరాజ్, ముఖ్య అధికారి దుర్గన్న, ఈవో శ్రీకుమార్, ఏఈ వాసుకుమార్, బసవరాజు, టీవీ గౌడ, లడ్డు వన్నూరువలీ, కొట్టూరు రమేష్, మురారి, తదితరులు పాల్గొన్నారు.

హోసూరు జోన్

1340 మందికి ఉచిత సైకిళ్ల పంపిణీ


సైకిళ్లు పంపిణీ చేసిన ఆహార భద్రతా శాఖ మంత్రి చక్రపాణి

హోసూరు ఆగస్టు 1 : హోసూరు ఆర్వీ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో తమిళనాడు ఆహార సరఫరా శాఖ మంత్రి చక్రపాణి విద్యార్థులకు పంపిణీ చేశారు. తమిళనాడు ప్రభుత్వ పాఠశాల విద్యాశాఖ తరపున రూ.64,43,920 విలువైన 1340 ఉచిత సైకిళ్లను ఆయన ఈ సందర్భంగా విద్యార్థులకు అందజేశారు. జిల్లా ప్రధాన విద్యాశాఖాధికారి మహేశ్వరి అందరికీ స్వాగతం పలికారు. జిల్లా కలెక్టర్ కె.ఎం.సరయు, , హోసూరు ఎమ్మెల్యే వై.ప్రకాశ్, మున్సిపల్ మేయర్ సత్య, హోసూరు సబ్ కలెక్టర్ ప్రియంక, డిప్యూటీ మేయర్ ఆనందయ్య, శాసనమండలి మాజీ సభ్యుడు మురుగన్, జిల్లా కౌన్సిల్ ఛైర్మెన్ యువరాజ్, ముఖ్య కార్యవర్గ సభ్యుడు ఎల్లోర మణి, ప్రిన్సిపల్ మునిరాజ్, హెల్త్ కమిటీ ఛైర్మెన్ మాదేశ్వరన్, టాక్స్ కమిటీ ఛైర్మెన్ చెన్నీరప్ప, పార్లమెంట్ సభ్యుడు మోసిన్ తాజ్, జిల్లా యూత్ ఆర్గనైజర్ సుమన్, పేరెంట్స్ ఉపాధ్యాయులు, అసోసియేషన్ కార్యనిర్వాహకులు శక్తివేల్, శ్రీధర్, సెక్రటరీ రాము, వార్డు సెక్రటరీ కుమార్, పీటీఏ కార్యనిర్వాహకులు అగరం, మురుగన్, యూత్ టీం ఎగ్జిక్యూటీవ్ లు బాలాజీ, ప్యాట్రిక్ ఫెర్నాండెజ్,శ్రీనివాస్, కళావతిరాణి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం

హోసూరు, ఆగస్టు 1: వేపనపల్లి, శూలగిరి, హోసూరు పంచాయతీ యూనియన్లలో పూర్తయిన పనులకు ఆహార సరఫరా శాఖ మంత్రి చక్రపాణి ప్రారంభోత్సవం చేశారు. వేపనపల్లి , శూలగిరి, హోసూరు పంచాయతీల్లో రూ.3 కోట్లతో గ్రంథాలయాలను ప్రారంభించారు. 35 మంది లబ్ధిదారులకు ఉచితంగా ఇళ్ల స్థలాలు అందజేశారు.

ఫ్లై ఓవర్ పనులతో ట్రాఫిక్ జామ్

హోసూరు, ఆగస్టు 1: కృష్ణగిరి జిల్లా హోసూరు మున్సిపాలిటీ పరిధిలోని జూజూవాడీ సిప్‌కాట్ బేస్ వద్ద కొనసాగుతున్న జాతీయ రహదారి ఫ్లై ఓవర్ పనులు ఏడాది కాలంగా పనులు సాగుతున్నాయి. దీంతో ఆ ప్రాంతంలో గురువారం ట్రాఫిక్ జామ్ ఏర్పాడింది. దీంతో ఆ ప్రాంతంలోని సామాన్య ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. వారాంతపు రోజు, వారంలో మొదటి రోజు, ఉదయం, సాయంత్రం ఈ ప్రాంతంలో ట్రాఫిక్ రద్దీ చాలా ఎక్కువగా ఉంటోంది. హోసూరు బెంగళూరు జాతీయ రహదారి కావడంతో ఈ రహదారి మీదుగా లక్షల సంఖ్యలో వాహనాల ప్రయాణిస్తాయి. ఈ ప్రాంతంల్లో చిన్న, పెద్ద ఫ్యాక్టరీలు వేలల్లో ఉన్నాయి. జాతీయ రహదారిపై వాహనాలు రాకపోకలు సాగించడంతో ఫ్యాక్టరీలకు వెళ్లే కార్మికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. కావున పనుల త్వరగా జరిగేలా చర్యలు తీసుకోవాలని జూజువాడి గ్రామ పారిశ్రామికవేత్తలు, కార్మికులు, వాహన డ్రైవర్లు, ప్రజలు కోరుతున్నారు.


సిప్‌కాట్ ఫ్లైఓవర్ వద్ద ఏర్పడిన ట్రాఫిక్ జామ్

ఉప్పర చైర్మన్ పదవి కల్యాణ కర్ణాటక వారికి ఇవ్వాలి

రాయచూరు, ఆగస్టు 1 : సమాజంలో అత్యంత వెనుకబడి ఉన్న ఉప్పర సమాజం అభివృద్ధి కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉప్పర అభివృద్ధి కార్పోరేషన్‌కు కల్యాణ-కర్ణాటక ప్రాంతానికి చెందిన నాయకుడిని చైర్మన్‌గా నియమించాలని ఉప్పర సమాజం సీనియర్ నాయకుడు సంతోష్ సాగర్ కోరారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక పత్రిక ప్రకటన విడుదల చేశారు. గతంలో కార్పొరేషన్ చైర్మన్‌లుగా పని చేసిన వారంతా దక్షిణ కర్ణాటక ప్రాంతానికి చెందిన వారు మాత్రమే ఉండగా కల్యాణ-కర్ణాటకకు చెందిన సీనియర్ నాయకుల కోసం ఎలాంటి కృషి చేయలేకపోయారన్నారు. ఇదే ప్రాంతానికి చెందిన మల్లికార్జున్ ఖర్గె కాంగ్రెస్ అధినేతగా ఉండగా ఆయనకు సహచరులైన ఉప్పరవారు ఆ దిశగా ప్రభుత్వం పైన పార్టీ పైన ఒత్తిడి తేవాలన్నారు. కాగా ఉప్పర సమాజానికి చెందిన అనేక మంది సీనియర్‌లు, అత్యంత విద్యవంతులు, రిటైర్డ్ అధికారులు ఎంతో మంది ఉన్నారని అలాంటి వారిని కార్పోరేషన్ చైర్మన్‌గా ఎంపిక చేసి ఉప్పర సమాజం వారికి తోడ్పాటు నందించాలన్నారు.

రాయచూరు రైల్వే లైన్‌ను త్వరగా పూర్తిచేయాలి


రాయచూరు ఎంపీ జీ కుమార్ నాయక్‌కు వినతి పత్రం అందజేస్తున్న బాబురావ్

రాయచూరు, ఆగస్టు 1 : రెండు దశాబ్దాలకు పైగా నత్తనడకన సాగుతున్న గిణిగేరా-మహబూబ్‌నగర్ రైల్వే లైన్ త్వరితగతిన పూర్తయ్యేలా కేంద్రం పై ఒత్తిడి తేవాలని దక్షిణ మధ్య రైల్వే బోర్డ్ సలహ సమితి మాజీ సభ్యుడు, బీజేపీ సీనియర్ నాయకుడు బాబురావ్ కోరారు. రాయచూరు ఎంపీ జీ కుమార్ నాయక్‌ను గురువారం కలిసి ఆయనకు వినతిపత్రం ఇచ్చారు. హుబ్లీ-హైదరాబాద్ మధ్య 120 కిమీ దూరాన్ని తగ్గించే గిణిగేరా-మహబూబ్‌నగర్ రైల్వే లైన్ పనుల్లో ఇప్పటికే కొంతభాగం పూర్తికాగా కేవలం సింధనూరు నుంచి రాయచూరు వరకు మాత్రమే పెండింగ్‌లో ఉందన్నారు. గిణిగేరా నుంచి సింధనూరు వరకు 88 కి.మీ దూరం పనులు ఇప్పటికే పూర్తయ్యాయన్నారు. ప్రస్తుతం సింధనూరు నుంచి 87 కి.మీ దూరంలో ఉన్న రాయచూరుకు లైన్ పూర్తి చేస్తే హుబ్లీ-హైదరాబాద్ మధ్య నేరుగా రైళ్లు సంచరించే అవకాశం ఏర్పడుతుందన్నారు. తాను నిబద్ధతతో కృషి చేస్తానని ఎంపీ తెలిపారు.

మైసూరు పాదయాత్రకు జేడీఎస్ సై

● జాతీయ నేతల బుజ్జగింపుతో దిగివచ్చిన కుమారస్వామి ● ఆరోపణలను తిప్పి కొడతాం : డీకే



బెంగళూరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ముడా అవినీతిని నిరసిస్తూ సీఎం సిద్దరామయ్య పదవికి రాజీనామా చేయాలని, సీబీఐ దర్యాప్తు చేయించాలని శనివారం నుంచి తలపెట్టిన చలో మైసూరు పాదయాత్రకు జేడీఎస్ మద్దతు పలికింది. బీజేపీ నేతల నిర్ణయాన్ని కేంద్రమంత్రి కుమారస్వామి తీవ్రంగా ఖండించిన విషయం తెలిసిందే. మా కుటుంబంపై ద్వేషం చూపిన ప్రీతంగౌడతో కలసి వేదిక పంచుకోవాలా...? పాదయాత్రకు వచ్చేది లేదంటూ కుమారస్వామి హెచ్చరించిన విషయం తెలిసిందే. దీంతో అప్రమత్తమైన బీజేపీ జాతీయ నేతలు చర్చలు జరపాలని సూచించారు. ఈమేరకు గురువారం ఢిల్లీలో కీలక సమావేశం జరిగింది. పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జ్ రాధామోహన్‌దాస్ కీలక చర్చలు జరిపించారు. కేంద్రమంత్రి కుమారస్వామి, ప్రహ్లాద్‌జోషిలు పాల్గొన్నారు. పాదయాత్ర నుంచి బీజేపీ హాసన్ మాజీ ఎమ్మెల్యే ప్రీతంగౌడను పక్కనపెట్టాలని తీర్మానించారు. ప్రీతంగౌడకు ప్రాధాన్యం ఇవ్వరాదని కూడా తీర్మానించారు. దీంతో శనివారం నుంచి ముడా అవినీతిపై చేపట్టదలిచిన చలో మైసూరు పాదయాత్రలో జేడీఎస్ పాల్గొననుంది. ఈమేరకు కేంద్ర మంత్రుల చర్చల అనంతరం ఢిల్లీలో పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ రాధామోహన్‌దా
స్ మీడియాతో మాట్లాడుతూ బీజేపీ, జేడీఎస్ నాయకులందరూ పాదయాత్రలో పాల్గొంటారన్నారు. వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్‌లో అవినీతి జరిగిందని స్వయంగా సీఎం సిద్దరామయ్య శాసనసభలో ప్రకటించారన్నారు. 6 కోట్లమంది కన్నడిగుల తరపున తాము పోరాటం చేస్తున్నామన్నారు. మిత్రపక్షంలో ఎటువంటి విబేధాలు లేవని తేల్చి చెప్పారు. గురువారం బెంగళూరు నైస్ రోడ్డునుంచి పాదయాత్ర ప్రారంభం కానుందన్నారు. కేంద్రమంత్రులు, రాష్ట్ర బీజేపీ, జేడీఎస్ ఎమ్మెల్యేలు అందరూ పాల్గొంటారన్నారు.

పాదయాత్రను తిప్పికొడతాం : డీసీఎం

బీజేపీ తలపెట్టిన పాదయాత్రను తిప్పికొడతామని డీసీఎం డీకే శివకుమార్ తెలిపారు. పాదయాత్రను ఏ విధంగా తిప్పికొట్టాలనేది ప్రకటిస్తామన్నారు. పాదయాత్ర ఆరంభమైన రోజునుంచి గత బీజేపీ పాలనలో 30 అక్రమాలు ఉన్నాయని, రోజుకొకటి బహిరంగం చేస్తామన్నారు. పాదయాత్ర విషయంలో తాము ఏ విధంగా ఎదుర్కొంటామనేది త్వరలోనే చూస్తారన్నారు.

రైలు ఢీ కొని వ్యక్తి మృతి

తాడిపత్రి, ఆగస్టు1: మండలంలోని వంగనూరు గ్రామ సమీపంలోని రైల్వేట్రాక్ వద్ద గురువారం ప్రమాదవశాత్తు రైలు ఢీకొనడంతో రంగారెడ్డి (45) మృతిచెందాడని రైల్వే ఎస్‌ఐ నాగప్ప తెలిపారు. ఆయన తెలిపిన వివరాలమేరకు కడపజిల్లా ఆర్‌ఎస్ కొండాపురం మండలం దత్తాపురం గ్రామానికి చెందిన రంగారెడ్డి బహిర్భూమికి వెళ్లాడు. అనంతరం ఇంటికి తిరిగి వస్తుండగా రైల్వే ట్రాక్ దాటుతుండగా వస్తున్న రైలును గమనించక పోవడంతో రైలు ఢీ కొని అక్కడికక్కడే మృతిచెందాడు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

తాడిపత్రి, ఆగస్టు1: మండలంలోని రావివెంకటాంపల్లి సమీపంలో గురువారం గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాలమేరకు రావివెంకటాంపల్లి సమీపంలో రోడ్డుపై నిద్రిస్తున్న గుర్తుతెలియని వ్యక్తిని గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో గాయాలపాలయ్యాడు. చికిత్స నిమిత్తం స్థానికులు తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడని పోలీసులు తెలిపారు. మృతుడికి 55సంవత్సరాల వయస్సు ఉండడంతోపాటు కలర్ లుంగీ, గోధుమ కలర్ గీతల షర్ట్ ధరించాడని వారు తెలిపారు.

హెబ్బాళలో నమ్మమెట్రోకు 45 ఎకరాలు

● ప్రభుత్వానికి బీఎంఆర్‌సీఎల్ లేఖ
● భవిష్యత్తులో అన్ని రవాణాలకు ఇదే జంక్షన్



బెంగళూరు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): నగరంలో దశాబ్దకాలంగా అత్యంత రద్దీప్రాంతంగా గుర్తింపుపొందిన హెబ్బాళ రానున్నకాలంలో అన్ని రవాణా వ్యవస్థలకు కీలక జంక్షన్ కానుంది. హెబ్బాళ ప్రాంతంలో నమ్మమెట్రో ప్రాజెక్టుకోసం 45 ఎకరాల భూమి అవసరమని బెంగళూరు మెట్రో రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ (బీఎంఆర్‌సీఎల్) ప్రభుత్వానికి లేఖ రాసింది. మెట్రో ప్రాజెక్టుకు సాధ్యమైనంత త్వరగా భూమిని కేటాయించాలని లేఖలో ప్రస్తావించింది. హెబ్బాళలో రైలు, మెట్రో రైలు, బస్టాండ్ ఏర్పాటుకు అనుకూలమైన ప్రాంతంగా గుర్తించారు. ఇందుకు సంబంధించి పలు ప్రాజెక్టులను ఇక్కడ అమలు చేయదలిచారు. హెబ్బాళలో బ్లూ, ఆరెంజ్‌తోపాటు రెడ్ లైన్ రెండు మెట్రో మార్గాలను నిర్మించేందుకు బీఎంఆర్‌సీఎల్ ప్రతిపాదించింది. కెంపాపురలో బ్లూ, ఆరెంజ్ మార్గాలలో రెండు మెట్రో స్టేషన్‌లు రానున్నాయి. నమ్మమెట్రోతోపాటు సబర్బన్ రైలు, సిటీ బస్‌ల కార్యాచరణకు కేంద్రంగా హెబ్బాళ మారనుంది. ఇక్కడ బహుళ అంతస్థుల పార్కింగ్ వ్యవస్థతోపాటు ఓ డిపోను ఏర్పాటు చేయనున్నారు. నమ్మమెట్రో మార్గంలో లింక్ బస్సుల సర్వీసులు అమలు చేస్తున్నారు. ఇలా ప్రయాణికులకు అన్ని విధాలా సదుపాయాలు భవిష్యత్తులో హెబ్బాళలో రానున్నాయి. రవాణా హబ్ కానుందని ఇందుకు అవసరమైన ప్రాజెక్టులను రూపకల్పన చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. వీటిలో లేక్ వ్యూ టూరిజం కంపెనీ ఓ ప్రాజెక్టును ఏర్పాటు చేసేందుకు కొన్నేళ్లకిందటే కర్ణాటక ఇండస్ట్రియల్ ఏరియా డెవలప్‌మెంట్ బోర్డు ద్వారా 55 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకుంది. ఇక్కడ 45 ఎకరాలలో వివిధ ప్రాజెక్టులను ప్రారంభించేందుకు కేఐఏడీబీ ద్వారా కేటాయించాలని బీఎంఆర్‌సీఎల్ విన్నవించింది. కేఐఏడీబీ నిర్ణయించిన విధంగా బీఎంఆర్‌సీఎల్ ఎకరా 12 కోట్ల రూపాయల చొప్పున 6,712 చదరపు మీటర్ల భూమిని సిల్క్ బోర్డునుంచి బెంగళూరు ఎయిర్‌పోర్ట్ వరకు నిర్మించే బ్లూ లైన్ నిర్మాణానికి దక్కించుకుంది. ప్రస్తుతం ఈ ప్రాంతం ఫ్లాట్‌గా ఉంది. భూ యజమానులకు ఇంకా పరిహారం ఇవ్వలేదు. భూమి ఖాళీగానే ఉంది. ఇందుకు 550 కోట్ల రూపాయలు ఖర్చు భరించేందుకు సిద్ధంగా ఉన్నట్టు బీఎంఆర్‌సీఎల్ ప్రకటించింది. ప్రస్తుతం బెంగళూరు నమ్మ మెట్రో యెల్లో లైన్ కార్యాచరణ సాగుతోంది. సిల్క్‌బోర్డ్ నుంచి ఎయిర్‌పోర్ట్‌కు వెళ్లే బ్లూ లైన్ నిర్మాణ పనులు వేగవంతంగానే సాగుతున్నాయి. ఇక పింక్‌లైన్‌కు సంబంధించి ప్లానింగ్ పనులు దాదాపు పూర్తయ్యాయి. జేపీనగర్ నుంచి కెంపాపుర వరకు మార్గం సిద్ధం కావాల్సి ఉంది. మాగడి రోడ్డు నుంచి బెంగళూరు అవుటర్ రింగ్‌రోడ్డుదాకా భవిష్యత్తులో వచ్చే అవకాశాలు ఉన్నాయి.



అనంతను అగ్రస్థానంలో నిలుపుతా

- రైతులందరికీ డ్రిప్ సౌకర్యం కల్పిస్తా
- నేనే మీవద్దకు వస్తా
- పాలకులు, అధికారులు బాధ్యతగా పనిచేయాలి
- పరిశ్రమలతో పెట్టుబడులు తీసుకొస్తా
- వక్క క్రషింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తాం
- వలస వెళ్లిన వారిని వెనక్కు రప్పిస్తాం
- సీఎం చంద్రబాబు నాయుడు ఉద్ఘాటన
- గుండుమలలో పింఛన్ పంపిణీకి హాజరు

పుట్టపర్తి(ఆంధ్రజ్యోతి), ఆగస్టు 1: హంద్రీనీవా ద్వారా ప్రతి ఎకరాకు నీరిచ్చి, తోడ్పాటునందించి, పంటలకు గిట్టుబాటు ధర కల్పించి దేశంలోనే ఉమ్మడి అనంత జిల్లా అగ్రస్థానంలో నిలుపుతానని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నారు. మడకశిర మండలం గుండుమలకు గురువారం విచ్చేసిన ముఖ్యమంత్రికి హెలీప్యాడ్ వద్ద రాష్ట్ర మంత్రులు సవిత, సత్యకుమార్, ఎంపీ బీకే పార్థసారథి, ఎమ్మెల్యేలు పరిటాల సునీత, కాలవ శ్రీనివాసులు, బండారు శ్రావణి, కందికుంట వెంకటప్రసాద్, దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప, కలెక్టర్, డీఐజీ, ఎస్పీ స్వాగతం తెలిపారు. మొదట మల్బరీ రైతు రంగనాథ్‌కు సంబంధించిన షెడ్డును పరిశీలించారు. పంట సాగులో లాభాలపై ఆరాతీశారు. అక్కడి నుంచి ఇళ్ల వద్దకే వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. గుండుమలలోని కరియమ్మ ఆలయం ముందు మడకశిర ఎమ్మెల్యే ఎం.ఎస్ రాజు అధ్యక్షతన ఏర్పాటు చేసిన ప్రజావేదిక కార్యక్రమంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. జిల్లాలోని రైతులందరికీ డ్రిప్ సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. 'నేరుగా మీ వద్దకు వస్తాననీ, మీరు.. నావద్దకు రావాల్సిన అవసరం లేద'ని ఆయన పేర్కొన్నారు. తద్వారా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, అధికారులకు బాధ్యత పెరుగుతుందన్నారు. హంద్రీనీవా ప్రాజెక్టు కింద జిల్లాలో జీడిపల్లి, భైరవాన్‌తిప్ప, పేరూరు, గొల్లపల్లి ప్రాజెక్టులను ప్రారంభించింది తానేనన్నారు. రూ.12,500 కోట్లతో ప్రాజెక్టు పూర్తి చేశామన్నారు. తద్వారా ఉమ్మడి జిల్లాలో వేలాదిమంది రైతుల పొలాలకు నీరిచ్చామన్నారు. ఎడారి జిల్లాగా పేరుగాంచిన ఈ ప్రాంతంలో కియ పరిశ్రమకు నీరిచ్చింది కూడా హంద్రీనీవా ద్వారానేనన్నారు. జిల్లాలో 47 లక్షల ఎకరాల భూమి ఉండగా.. ఇందులో 11 లక్షల ఎకరాలు మాత్రమే సాగుభూమి అన్నారు. పంటలు సాగుచేస్తుంది మాత్రం 2 లక్షల ఎకరాల్లో మాత్రమేనన్నారు. మడకశిర ప్రాంతంలో వక్క రైతులు అధికంగా ఉన్నారన్నారు. ఇక్కడ రైతులందరూ కలిసి వక్క క్రషింగ్ యూనిట్ ఏర్పాటు చేసుకుందామంటే భూమి, యూనిట్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సాయంతో ఏర్పాటు చేస్తామని సీఎం ప్రకటించారు. అలా కాదంటే ప్రైవేటు వ్యక్తులకు అప్పగించి, ఇక్కడ వక్క క్రషింగ్ యూనిట్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. దేశంలో ఏ ముఖ్యమంత్రీ చేయనివిధంగా మారుమూల ప్రాంతం గుండుమలకు వచ్చి పింఛన్ ఇచ్చానన్నారు. గత సీఎం జగన్మోహన్‌రెడ్డి వస్తే పరదాలు కట్టేవారనీ, చెట్లు నరికేవారనీ, అరెస్టులు చేసేవారన్నారు. తాను మాత్రం జనంలో ఒకడిగా గ్రామానికి వచ్చానన్నారు. జిల్లాలో చాలామంది గత ఐదేళ్లలో వలస వెళ్లారన్నారు. హంద్రీనీవా ద్వారా ప్రతి చెరువుకు నీరందించి, ప్రతి ఎకరాకు నీరిస్తామన్నారు. తద్వారా వలస వెళ్లినవారిని తిరిగి రప్పించే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. గ్రామానికి అవసరమైన సదుపాయాలన్నీ కల్పిస్తామన్నారు. మల్బరీ రైతులకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. జిల్లాలో అధికంగా వాణిజ్య పంటలు సాగుచేసేలా ప్రోత్సహించి, ఆదుకుంటామన్నారు. ఉమ్మడి జిల్లాలో 14 ఎమ్మెల్యే, రెండు ఎంపీస్థానాలు గెలిపించినందుకు రుణపడి ఉంటానన్నారు. అనంతను సస్యశ్యామలం చేసి, అన్ని విధాలా అభివృద్ధి చేసే బాధ్యత తీసుకుంటానని చంద్రబాబు ఉద్ఘాటించారు. ప్రభుత్వం జవాబుదారీగా పనిచేస్తుందన్నారు. రూ.35 పింఛన్‌ను ప్రారంభించింది ఎన్టీఆర్ అనీ, దానిని రూ.70కి, తరువాత రూ.1000, రూ.2వేలు, రూ.4వేలు చేసింది ఎన్డీఏ ప్రభుత్వమన్నారు. ఏప్రిల్ నుంచి రూ.4వేలు పింఛన్ ఇస్తామని చెప్పి మాట నిలబెట్టుకున్న ఘనత ఈ ప్రభుత్వానికే దక్కిందన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్, ఎంపీ బీకే పార్థసారథి, మాజీ ఎమ్మెల్యే గుండుమల తిప్పేస్వామి, ఈరన్న, ఎమ్మెల్యేలు కాలవ శ్రీనివాసులు, పరిటాల సునీత, బండారు శ్రావణి, కందికుంట వెంకటప్రసాద్, పల్లె సింధూరారెడ్డి, అమిలినేని సురేంద్రబాబు, దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, టీడీపీ ధర్మవరం ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్, శ్రీసత్యసాయి, అనంత జిల్లాల అధ్యక్షులు కొల్లకుంట అంజినప్ప, వెంకటశివుడుయాదవ్, మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి, కలెక్టర్లు చేతన్, వినోద్‌కుమార్, సబ్ కలెక్టర్ అపూర్వభరత్, ఎస్పీలు రత్న, మురళీకృష్ణ పాల్గొన్నారు.


ప్రజావేదిక సభలో మాట్లాడుతున్న చంద్రబాబునాయుడు

పోరాట యోధుడు ఎంఎస్‌రాజు: సీఎం

మడకశిరటౌన్, ఆగస్టు 1: మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ఎప్పుడూ సమస్యలపై పోరాడుతూనే ఉంటాడని సీఎం చంద్రబాబునాయుడు అన్నారు. మడకశిర నియోజకవర్గ అభివృద్ధికి ఆయన కృషి చేస్తారని పేర్కొన్నారు. గురువారం గుండుమల గ్రామంలో జరిగిన ప్రజావేదిక కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఇప్పటి వరకు ఎంఎస్‌రాజు సమస్యలపై పోరాడారని, ఇప్పుడు మడకశిర నియోజకవర్గ అభివృద్ధిపై మరొకసారి పోరాటాన్ని ప్రారంభించారన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తామని వివరించారు. యువకుడు, ఉత్సాహవంతుడిని ఎమ్మెల్యేగా ఎన్నుకొన్నారని, అందులోనూ గుండుమల పంచాయతీలో తెలుగుదేశం పార్టీకి అత్యధికంగా మెజారిటీ అందించారని, అందుకు పంచాయతీ ప్రజలకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలుపుతున్నానని సీఎం అన్నారు.


గుండుమలలో ప్రజలకు అభివాదం చేస్తున్న సీఎం చంద్రబాబు


జ్ఞాపికను సీఎంకు అందజేస్తున్న ఎంఎస్ రాజు దంపతులు

జోరువానలో బాబు ప్రసంగం

హిందూపురం, ఆగస్టు 1: మడకశిర మండలం గుండుమల గ్రామానికి వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజావేదిక వద్ద ప్రసంగించే సమయంలో మొదట మూడు నిమిషాల పాటు తేలికపాటి వర్షం పడింది. ఆ తరువాత 15నిమిషాల పాటు జోరువాన కురిసింది. అయినా చంద్రబాబు ప్రసంగం ఆపలేదు. జోరువానలోనే అక్కడి జనం కుర్చీలు తలపై పెట్టుకుని సీఎం ప్రసంగాన్ని విన్నారు. అంత వర్షం కురుస్తున్నా ఒక్కరూ పక్కకు వెళ్లకుండా ప్రసంగం వినడం పట్ల సీఎం ఆశ్చర్యం వ్యక్తం చేశారు. అంతేకాకుండా చంద్రబాబు తమ గ్రామానికి రావడంతో వర్షం కురిసిందని గ్రామస్థులు సంబరపడ్డారు. మారుమూల ప్రాంతమైన తమ గ్రామానికి చంద్రబాబు రావడం అదృష్టంగా భావిస్తున్నామని ఆనందం వ్యక్తం చేశారు.

తడిసిన జిల్లా అధికారులు

ముఖ్యమంత్రి ప్రసంగిస్తున్న సమయంలో జోరువాన కురుస్తుండగా కలెక్టర్, సబ్ కలెక్టర్, డీఐజీ, ఎస్పీ అక్కడే ఉన్నారు. జోరువానలో వారు తడిసి ముద్దయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ తడిసిపోగా జిల్లా ఎస్పీ రత్న డీఐజీకి గొడుగుపట్టి జోరువానలోనే ఉండిపోయారు.


వానలో కుర్చీలు తలపై పెట్టుకుని సీఎం ప్రసంగం వింటున్న జనం

నేటి ప్రముఖులు


పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

పింగళి వెంకయ్య (జయంతి)



జాతీయ పతాక రూపకర్త, స్వాతంత్ర్య సమరయోధుడు పింగళి వెంకయ్య 1876 ఆగస్టు 2న కృష్ణా జిల్లా మచిలీపట్నం ప్రాంతం భట్లపెనుమర్రులో జన్మించారు. వ్యవసాయంతోపాటు విద్యావేత్తగా, భూగర్భ శాస్త్రవేత్తగా రాణించారు. 19వ యేట సైన్యంలో చేరి దక్షిణాఫ్రికాలోని రెండవ బోయర్ యుద్ధంలో పాల్గొన్నారు. 1916లో 'భారతదేశానికొక జాతీయ జెండా' అనే పుస్తకాన్ని ఆంగ్లంలో రాసి ప్రచురించారు. మచిలీపట్నంలో విద్యాసంస్థను ఏర్పాటు చేశారు. సంస్కృతం, ఉర్దూ, జపాన్ భాషల్లో మంచి పాండిత్యం పొందారు. జపాన్‌భాషలో అనర్గళంగా మాట్లాడే ఆయనను 'జపాన్ వెంకయ్య' అని పిలిచేవారు. నిరాడంబర, నిస్వార్థమైన జీవితం గడిపిన మహామనిషి. 1963 జూలై 4న దివంగతులయ్యారు. కాగా 2009లో ఆయన జ్ఞాపకార్థం పోస్టల్‌స్టాంపు విడుదల చేశారు.

ఆచార్య ప్రఫుల్ల చంద్ర రే (జయంతి)



ఆచార్య 'సర్' ప్రఫుల్ల చంద్ర రే 1861 ఆగస్టు 2న ప్రస్తుత బంగ్లాదేశ్‌లోని ఖుల్నా ప్రాంతంలో జన్మించారు. బెంగాలీ కెమిస్ట్, విద్యావేత్తగా, పారిశ్రామికవేత్తగా రాణించారు. మానవతావాదిగా గుర్తింపు పొందారు. రసాయనశాస్త్రంలో గొప్ప ప్రొఫెసర్. దేశంలో తొలి ఫార్మాకంపెనీ అయిన బెంగాల్ కెమికల్స్ అండ్ ఫార్మా స్యూటికల్స్ సంస్థాపకులు. 'రాయల్ సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీ'చే గౌరవం అందుకున్నారు. ఎన్నో గౌరవ డాక్టరేట్‌లు పొందారు. ఇంగ్లీషులో ఆటోబయోగ్రఫీ రాశారు. బెంగాల్ సాహిత్య సమ్మేళనానికి రెండుసార్లు ఎంపికయ్యారు. 1944 జూన్ 16న కన్నుమూశారు.

బళ్ళారి రాఘవ (జయంతి)




తెలుగు నాటకరంగ ప్రముఖులు, బళ్ళారి రాఘవ 1880 ఆగస్టు 2న అనంతపురం జిల్లా తాడిపత్రిలో జన్మించారు. పూర్తి పేరు తాడిపత్రి రాఘవాచార్యులు. వృత్తిరీత్యా న్యాయవాది. బ్రిటీష్ ప్రభుత్వం ఆయన ప్రతిభను గుర్తించి పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమించింది. 'రావు బహద్దూర్' అని బిరుదు కూడా ఇచ్చింది. అదే రీతిన తెలుగు, కన్నడ, ఇంగ్లీషు, హిందీ భాషలలో నాటకాలు ప్రదర్శించారు. గాంధీ, ఠాగూర్, జార్జ్‌బెర్నార్డ్‌షా వంటి వారు ఆయన నాటకాలను ప్రశంసించారు. స్త్రీలను నాటకాలలో పాల్గొనడానికి రాఘవ ప్రోత్సహించేవారు. శ్రీలంక, ఇంగ్లండ్, ఫ్రాన్స్, జర్మనీ, స్విట్జర్లాండ్ తదితర దేశాల సదస్సులలో నాటకాలు, కళలపై ప్రసంగించారు. తన సమయాన్ని, సంపదను నాటకరంగం కోసమే వెచ్చించారు. 1946 ఏప్రిల్ 16న కన్నుమూశారు.

మల్లాది సుబ్బమ్మ (జయంతి)



స్త్రీవాద రచయిత్రి 'మల్లాది సుబ్బమ్మ' గుంటూరు జిల్లా రేపల్లె తాలూకా పోతార్లంకలో 1924 ఆగస్టు 2న జన్మించారు. స్త్రీ స్వేచ్ఛ పత్రిక సంపాదకురాలిగా వ్యవహరించారు. అదే విధంగా 'వికాసం' అనే పత్రికను కూడా నిర్వహించారు. స్త్రీ జనోద్ధరణ, కుటుంబ నియంత్రణ, స్త్రీ విద్యకోసం కృషి చేశారు. మద్యపాన నిషేధ ఉద్యమంలో కీలకంగా వ్యవహరించారు. 110 పుస్తకాలు, 500కుపైగా వ్యాసాలు రచించారు. ఫిలిం సొసైటీకి ఛైర్‌పర్సన్‌గా వ్యవహరించారు. తన యావదాస్తిని మల్లాది సుబ్బమ్మ ట్రస్టుకు సమర్పించారు. 2014 మే 15న కన్నుమూశారు.

కల్నల్ హెన్రీ స్టీల్ అల్కాట్ (జయంతి)



కల్నల్ హెన్రీ స్టీల్ అల్కాట్ 1832 ఆగస్టు 2న యూఎస్‌లోని న్యూజెర్సీలో జన్మించారు. అమెరికాకు చెందిన మిలిటరీ అధికారి, పాత్రికేయుడు, న్యాయవాది. థియోసాఫికల్ సొసైటీ సహసంస్థాపకులు, తొలి అధ్యక్షుడు. శ్రీలంకలో బుద్ధిజం విస్తరణకు ఎంతో కృషి చేశారు. తుదిశ్వాస వరకు థియోసాఫికల్ సొసైటీకి అధ్యక్షుడిగా కొనసాగడం విశేషం. 1907 ఫిబ్రవరి 17న మద్రాస్‌లో కన్నుమూశారు.

దేవిశ్రీ ప్రసాద్ (పుట్టినరోజు)



ప్రముఖ సంగీతదర్శకుడు దేవిశ్రీ ప్రసాద్ 1979 ఆగస్టు 2న తూర్పుగోదావరి జిల్లా వెదురుపాకలో జన్మించారు. స్వరకర్తగా, గాయకుడిగా రాణించారు. అభిమానులచే డీఎస్‌పీగా పిలువబడ్డారు. తెలుగు, తమిళ భాషల్లో 20ఏళ్లలో వందకు పైగా సినిమాలకు సంగీతాన్ని అందించారు. నంది అవార్డుతోపాటు ఫిల్మ్‌ఫేర్ పురస్కారాలు అందుకున్నారు. 10 ఫిల్మ్‌ఫేర్, 5 సినీ ఎమ్ అవార్డులు, 7 సైమా అవార్డులు, ఒక నంది అవార్డు ఇతర గౌరవాలు అందుకున్నారు. అంతేకాక స్టేజ్ ప్రదర్శనలతో రాక్‌స్టార్ డీఎస్పీగా సభికులను అలరిస్తున్నారు.

ప్రియుడు అబార్షన్ చేయించాడని న్యాయం కోరుతూ ప్రధానికి లేఖ



బెంగళూరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): బలవంతంగా అబార్షన్ చేయించిన ప్రియుడిపై పోలీసులు చర్యలు తీసుకోవడం లేదని తగిన న్యాయం జరిపించాలని కోరుతూ బాధిత మహిళ ప్రధానమంత్రికి లేఖ రాసిన విషయం రామనగర జిల్లాలో గురువారం వెలుగు చూసింది. న్యాయం జరగకపోతే రామనగర ఎస్పీ కార్యాలయం ముందు ఆత్మహత్య చేసుకుంటానని లేఖలో ప్రస్తావించారు. బాధిత మహిళ ఫిర్యాదు మేరకు రామనగరలో ఓ నర్సుగా పనిచేసిన బాధిత మహిళకు ఆరేళ్లక్రితం వివాహం కాగా కొద్దిరోజులకే భర్త వదిలేశాడు. ఆ తర్వాత దయానంద్ అనే వ్యక్తితో స్నేహం ఏర్పడింది. అది కాస్త ప్రేమగా మారింది. శారీరకంగా సన్నిహితం కావడంతో గర్భందాల్చినట్లు లేఖలో ప్రస్తావించారు. ఒత్తిడి చేయించి అబార్షన్ చేయించారని ఈమేరకు రామనగర పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు లేఖలో పేర్కొన్నారు. దయానంద్‌పై పోలీసుల ద్వారా న్యాయం జరిపిస్తానని, అతడి ఫ్రెండ్ 1.40 లక్షల రూపాయలు తీసుకున్నాడని, ఆ సొమ్మును సర్కిల్ ఇన్‌స్పెక్టర్ లంచంగా తీసుకున్నారని అయినా న్యాయం జరగలేదని బాధిత మహిళ లేఖలో పేర్కొన్నారు. పోలీసులు దయానంద్‌కు మద్దతు ఇస్తున్నారని ఆరోపించారు. న్యాయం జరగకపోతే ఆత్మహత్య చేసుకుంటానని ఆమె లేఖలో పేర్కొంది.

ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య

రాయదుర్గం, ఆగస్టు 1 : హోటల్‌లో రోజు వారి కూలీగా పనిచేసే ఉడిపి ఈరన్న(56) ఆర్థిక ఇబ్బందులు భరించలేక ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబీకులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. కర్ణాటకలోని దావణగెరకు చెందిన ఈరన్న 20 ఏళ్లుగా రాయదుర్గంలోని సిండికేట్ బ్యాంక్ వెనుక అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నాడు. జీవనోపాధి కోసం హోటల్ నిర్వహిస్తుండేవాడు. లాభం లేకపోవడంతో హోటల్‌ను మూసేసి ఇటీవల కార్మికుడిగా ఓ హోటల్‌లో పనిచేస్తుండేవాడు. కుటుంబపోషణ భారం కావడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతుండేవాడు. ఈ క్రమంలో గురువారం మనస్థాపానికి గురై ఇంట్లో ఉన్న కారిడార్‌లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కొద్దిసేపటికి భార్య గమనించి చుట్టుపక్కల వారి సాయంతో కిందికి దింపి చూడగా అప్పటికే మృతి చెందాడు. రోజువారీగా రూ. 300 వందలు కూలీ గిట్టకపోవడంతో అప్పులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. వీటికి తోడు కర్ణాటకలోని డావణగెర వద్ద అన్నదమ్ముల మధ్య భూవివాదం కూడా ఉంది. పలు సందర్భాల్లో తన వాటా భూమి ఇస్తే అమ్ముకుని అప్పులు తీర్చుకుంటానని స్నేహితుల ముందు వాపోయినట్లు తెలిసింది. ఆత్మహత్య చేసుకున్న విషయం పోలీసులకు తెలపడంతో హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రాయదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

భాకరాపేట ఘాట్‌లో ప్రమాదం

● కొండరాయిని ఢీకొన్న కేఎస్ ఆర్టీసీ బస్సు


కొండరాయిని ఢీ కొన్న బస్సు

చంద్రగిరి ఆగస్టు 1: తిరుపతి జిల్లా చంద్రగిరి మండల పరిధిలోని భాకరాపేట ఘాట్ రోడ్డులో తిరుపతి, మదనపల్లి జాతీయ రహదారిలో గురువారం కర్ణాటక ఆర్టీసీ బస్సు అదుపు తప్పి రోడ్డు పక్కనున్న కొండరాయిని ఢీకొనడంతో డ్రైవర్ దిలీప్‌కుమార్‌కు తీవ్ర గాయాలు కాగా, ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు... కర్ణాటక రాష్ట్రం, బాగేపల్లి ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు బెంగళూరు నుంచి తిరుపతికి వస్తుండగా మార్గమధ్యంలో భాకరాపేట ఘాట్ రోడ్డులోకి రాగానే బ్రేక్ ఫెయిల్ కావడంతో అదుపుతప్పి పక్కనున్న బండరాయని ఢీ కొట్టింది. డ్రైవర్ చాకచక్యంగా లోయలో పడకుండా బండరాయి వైపు తిప్పించి ఢీకొనడంతో పెను ప్రమాదం తప్పింది. ఈప్రమాదంలో బస్సు డ్రైవర్ దిలీప్‌కుమార్‌కు తీవ్ర గాయాలు కాగా, 17 మంది ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో చికిత్స నిమిత్తం తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. ప్రమాదం జరగడంతో ఆదారిలో కొంత సేపు వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. చంద్రగిరి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.